పేదలపై అధికారుల ప్రతాపం



పేదలను అరెస్టు చేస్తున్న పోలీసులు

- అబ్దుల్లాపూర్ మెట్‌లో జెసిబిలతో గుడిసెల కూల్చివేత
- పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించిన బాధితులు
- యాచారం పోలీసుస్టేషన్‌కు సిపిఎం నేతల తరలింపు
- పేదల గుడిసెలు కూల్చడం అన్యాయం : తమ్మినేని
- ఎర్రజెండా పక్షాన పేదలకు ఇండ్ల జాగాలు పంచుతాం : జాన్‌వెస్లీ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ భూమిలో పేదలు వేసుకున్న గుడిసెలు, ఇళ్లను రెవెన్యూ అధికారులు పోలీసుల వెంటబెట్టుకెళ్లి జెసిబిలతో కూల్చేశారు. అడ్డుకోబోయిన పేదలను లాక్కెళ్లి అరెస్టు చేశారు. వారికి అండగా వెళ్లిన సిపిఎం నేతలనూ అరెస్టు చేసి మరో పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో ఆదివారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి..

అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామ రెవెన్యూ సర్వే నెం.283, సర్వే నెం.573లోని ప్రభుత్వ భూమిలో చాలా రోజుల కిందట పేదలు ఇండ్లు, గుడిసెలు నిర్మించుకున్నారు. తమకు ఇంటి జాగా పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అయితే, వేసుకున్న గుడిసెలను రెవెన్యూ అధికారులు ఆదివారం ఉదయం కూల్చేశారు. గుడిసెల్లో నివసించే పేదలను అరెస్టు చేశారు. దాంతో మండల కేంద్రంలోని జాతీయ రహదారి 65పై బాధితులు ఆందోళనకు దిగారు. అనంతరం పోలీస్ స్టేషన్‌ను ముట్టడించి ఆందోళన చేపట్టారు. వారికి సిపిఎం నాయకులు సామేల్, జగదీష్ తదితరులు మద్దతుగా నిలిచారు. అదేవిధంగా సిపిఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్, నాయకులు పగడాల యాదయ్య, దుబ్బాక రామచందర్, మండల కార్యదర్శి ఈ.నరసింహ, గోరింకల నర్సింహతోపాటు మరికొందరిని పోలీసులు అరెస్టు చేసి యాచారం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వారిని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ, ఇతర నేతలు పరామర్శించారు.

పేదల గుడిసెలు కూల్చడం అన్యాయం : తమ్మినేని

ఇళ్లు లేని పేదలు ప్రభుత్వ జాగాలో గుడిసెలేసుకుంటే వాటిని అన్యాయంగా కూల్చారనీ, గుడిసెవాసులను పోలీసులు అక్రమంగా అరెస్టులు చేయడమేంటని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ సర్వే నెంబర్ 283 ప్రభుత్వ భూమిలో 2007లో 573 మంది ఇండ్లు లేని పేదలకు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం లేఔట్ చేసి పట్టాలు సిద్ధం చేసిందని పేర్కొన్నారు. అయినా వాటిని పంపిణీ చేయలేదని తెలిపారు. ఇళ్ల జాగాలు ఇవ్వాలని పలుసార్లు అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేకపోవడంతో సిపిఎం ఆధ్వర్యంలో 600 గుడిసెలేసుకుని అక్కడే 37 రోజులుగా నివసిస్తున్నారని తెలిపారు. వాటిని ఆదివారం ఉదయం రెవెన్యూ అధికారులు, 250 మంది పోలీసులతో వచ్చి తొలగించారని పేర్కొన్నారు. లాఠీ చార్జి చేసి పేదలను భయభ్రాంతులకు గురి చేశారని తెలిపారు. మహిళలు, పిల్లలు తీవ్రంగా గాయపడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలను అక్రమంగా అరెస్టులు చేసి వారిని భయభ్రాంతులకు గురిచేయటమేంటని ప్రశ్నించారు. సంబంధిత సర్వే నంబర్‌లో 300 ఎకరాల భూమి ఉండగా, పది ఎకరాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారులు 150 బిల్డింగులు అక్రమంగా నిర్మిస్తున్నారని తెలిపారు. పట్టాలిచ్చిన పేదలకు మాత్రం నేటికీ ఇంటి స్థలం హద్దులు చూపించలేదని పేర్కొన్నారు. పేదలకు అండగా నిలిచిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్ వెస్లీ, పార్టీ జిల్లా కార్యదర్శి కె భాస్కర్, మండల కార్యదర్శి ఈ నరసింహ, జిల్లా నాయకులు దుబ్బాక రామచందర్, పగడాల యాదయ్యతో పాటు 14 మందిని పోలీసులు అరెస్టు చేశారని తెలిపారు. రెండు రోజుల క్రితమే రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలంలో కూడా ఇదే పరిస్థితి నెలకొన్నదని పేర్కొన్నారు. ఇప్పటికైనా పేదలపై దాడులు పునరావృతం కాకుండా చూడాలని ప్రభుత్వానికి సూచించారు. నాటి ప్రభుత్వాలు పట్టా సర్టిఫికెట్లు ఇచ్చినందున ఇండ్లు కట్టుకోవడానికి కుటుంబానికి ఐదు లక్షలు ఆర్థిక సహాయం చేయాలని డిమాండ్ చేశారు. వారి పోరాటానికి సిపిఎం అండగా ఉంటుందని తెలిపారు.

ఇంటి జాగా ఇచ్చేవరకు గుడిసె పోరాటం ఆగదు
సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ

ప్రతి పేదవాడికీ ఇంటి జాగా ఇచ్చేవరకు గుడిసె పోరాటం ఆగదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ, నాయకులు అన్నారు. గుడిసెల ప్రాంతంలో, యాచారం పోలీసుస్టేషన్‌లో వారు మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టి పేదల గుడిసెల పోరాటాన్ని అణచివేయాలని చూస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదవారందరికీ తలదాచుకోవడానికి ఇంటి జాగా లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటుంటే, ప్రభుత్వం దర్జాగా రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని ప్రోత్సహిస్తుందని విమర్శించారు. రాష్ట్రంలో ఎక్కడైతే ప్రభుత్వ భూములు ఉన్నాయో అక్కడ ఎర్రజెండా పక్షాన నిరుపేదలకు ఇండ్ల జాగాలు పంచుతామని హెచ్చరించారు. ఒక కుటుంబంలో నలుగురు ఐదు అన్నదమ్ములు ఉండి తలదాచుకోవడానికి ఇంటి జాగా లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. అలాంటి పేదలు ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుంటే పోలీసులతో అక్రమ అరెస్టులు చేస్తుందన్నారు. పోలీసుల బెదిరింపులకు భయపడేది లేదని, పోరాటం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, భూకబ్జాదారులు కోట్ల విలువైన ప్రభుత్వ భూములను ఆక్రమించుకుంటే పట్టించుకోని రెవెన్యూ అధికారులు పేదల ఇళ్లను కూల్చివేయడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో అధికార పార్టీ నాయకులు ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని అమ్ముకుంటుంటే అధికారుల కళ్లకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. మహిళల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు దారుణమన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ మహిళలపై దాడులు చేయమని చెప్పారా అని ప్రశ్నించారు. ప్రాణం పోయినా సరే తమ భూములు దక్కేవరకు పోరాడుతామని స్పష్టం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి.. ఎక్కడైతే ప్రభుత్వ భూములు ఉన్నాయో అక్కడ అర్హులైన నిరుపేదలందరికీ ఇంటి స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనిపై తహసీల్దార్ అనితారెడ్డి స్పందిస్తూ.. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు.



ప్రజాస్వామిక, లౌకిక శక్తులు ఏకం కావాలి

- ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో వక్తలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

దేశంలో ప్రమాదకర రోజులు రాబోతున్నాయని ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, తాతా మధుసూధన్, మాజీ ఎమ్మెల్సీ నాగేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. బిజెపి అధికారంలోకి వచ్చాక ఎమర్జెన్సీ రోజులు కొనసాగుతున్నాయని చెప్పారు. ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో నగరంలో పనిచేసిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బిజెపి, ఆర్ఎస్ఎస్ శక్తులు ప్రజల్లో తిరోగమన భావాలను పెంచి పోషిస్తున్నాయన్నారు. ప్రజల్లో అశాస్త్రీయ భావాలను ప్రచారం చేస్తూ అవే నిజమైనవని ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ఇలాంటి భావజాల ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు ప్రజాస్వామిక, లౌకికశక్తులు ఏకం కావాలని పిలుపునిచ్చారు. ప్రజాతంత్ర ఉద్యమాల్లో ఎస్ఎఫ్ఐ చురుకైన పాత్ర పోషిస్తున్నదని కొనియాడారు. విద్యార్థుల సమస్యలపై సమరశీల పోరాటాలు చేస్తుందని చెప్పారు. ఎస్ఎఫ్ఐ నేర్పిన శాస్త్రీయ ఆలోచనలతో ముందుకు సాగుతున్నామన్నారు.

21న మత్స్యకారుల రాష్ట్ర సదస్సు

పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 21న రాష్ట్ర సదస్సును జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్‌లో నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర అధ్యక్షులు గోరెంకల నరసింహ, కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ తెలిపారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సదస్సు పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత్స్య వృత్తి రక్షణ, మత్స్యకారుల సంక్షేమం కోసం రాష్ట్ర బడ్జెట్లో రూ. ఐదు వేల కోట్లు కేటాయించాలనీ, ప్రతి మత్స్య సొసైటీకీ రూ.పది లక్షలు ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. 50 ఏళ్లు నిండిన మత్స్యకారులకు వృద్ధాప్య పెన్షన్ ప్రతి నెల రూ.ఐదు వేలు ఇవ్వాలనీ, రెండో విడతగా ఎన్‌సిడిసి ద్వారా 34 రకాల సంక్షేమ పథకాలు అందించాలని రాష్ట్ర సదస్సులో తీర్మానం చేసి ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు చనమోని శంకర్, రాష్ట్ర కార్యదర్శి అరవపల్లి శ్రీరాములు, రాష్ట్ర కమిటీ సభ్యులు కనకతార తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారి అదృశ్యం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వ్యాపారి అదృశ్యమైన ఘటన రంగారెడ్డి జిల్లా శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎ శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. శంషాబాద్ మండలం పాలమాకుల గ్రామానికి చెందిన ఎడ్ల కిషోర్‌గౌడ్ వృత్తిరీత్యా వ్యాపారి, అతను ఈ నెల 10వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దాంతో కంగారుపడిన కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువులు, స్నేహితుల వద్ద వెతికినప్పటికీ అతని ఆచూకీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. అతని ఆచూకీ తెలిసిన వారు పోలీస్ స్టేషన్‌కు లేదా కుటుంబ సభ్యులైన కిరణ్‌గౌడ్ (9391225804) సమాచారం ఇవ్వాలని కోరారు.

15న కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు

- బిసి హక్కుల సాధన సమితి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిసి కుల గణనతో సహా డిమాండ్ల సాధనకు ఈ నెల 15న జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు ధర్నాలను జయప్రదం చేయాలని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకట్రాములు, పాండురంగాచారి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. దేశ జన గణనలో బిసి కులగణన చేపట్టాలనీ, జనాభా ప్రాతిపదికన బడ్జెట్లో నిధులు కేటాయించి బిసిల సంక్షేమానికి అభివృద్ధికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం బిసిల పట్ల వివక్షత చూపడం సహించరానిదని పేర్కొన్నారు. కేంద్రంలో తక్షణమే బిసి మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం బిసి బంధు ఏర్పాటు చేసి బిసిల ఆర్థిక అభివృద్ధికి తోడ్పడాలని, దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారందరికీ బిసి రుణాలు అందించాలని, ప్రయివేటు రంగంలో బిసీలకు రిజర్వేషన్ కల్పించాలనీ, ఇడబ్ల్యుసి పది శాతం కోటాపై సుప్రీంకోర్టు తీర్పు సామాజిక కోణంలో వర్తింపజేయాలనీ, అర్హులైన వారికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

రైతు సంఘం సభను జయప్రదం చేయండి

- తెలంగాణ రైతుసంఘం



పోస్టర్‌ను ఆవిష్కరించిన రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర రెండో మహాసభ ఈ నెల 27,28,29 తేదీల్లో నల్లగొండలో జరుగుతాయనీ, 27న బహిరంగ సభ ఉంటుందని ఆహ్వాన సంఘం అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, ఎఐకెఎస్ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి, రైతుసంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోతినేని సుదర్శన్‌రావు, టి సాగర్ తెలిపారు. ఆ మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం మహాసభకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నవంబర్ 27న రైతుల భారీ ప్రదర్శన అనంతరం బహిరంగ సభ జరుగుతుందన్నారు. నవంబర్ 28న మహాసభలు ప్రారంభమవుతాయనీ, సభలకు అఖిల భారత కిసాన్ సభ జాతీయ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ అశోక్ దావలే, హనన్‌మొల్లా, సహాయ కార్యదర్శి డాక్టర్ విజూ కృష్ణన్ పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. కౌలు, పాడి, మహిళా, పత్తి, చెరుకు, రైతులు పాల్గొంటారని చెప్పారు. రైతుల ఆదాయం ప్రభుత్వ విధానాల ఫలితంగా తగ్గుతుందని అన్నారు. ఉపకరణాల ధరలు విపరీతంగా పెరుగుతున్న స్థితిలో కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధరలు పెంచకపోవడం వల్ల రైతులు రుణగ్రస్తులు అవుతున్న తీరును వివరించారు. కనీస మద్దతు ధరలను శాస్త్రీయంగా నిర్ణయించకపోవడం వల్ల రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్లను కార్పొరేట్ చేతుల్లో పెట్టడానికి ఈనామ్ తెచ్చారని విమర్శించారు. మార్కెట్ల నుంచి ప్రభుత్వం వైదొలిగే ప్రయత్నం జరుగుతుందన్నారు. ఎరువుల సబ్సిడీలు తగ్గించడానికి పీఎం ప్రణామ్ పథకాన్ని తెచ్చిందని విమర్శించారు. విత్తన పరిశోధనలను పూర్తిగా విరమించి ఇతర దేశాల నుంచి బహుళజాతి సంస్థల టెక్నాలజీని దిగుమతి చేసుకుంటున్నారన్నారు. ఫసల్ బీమా పథకం అమలుకాకపోవడంతో రైతులు ఇబ్బదులకు గురవుతున్నారన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టం వాటిల్లినప్పటికీ రైతులకు పరిహారం అందడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ధరణి వెబ్‌సైట్‌లో తప్పులు ఉండడం వల్ల రైతులకు ప్రభుత్వ పథకాలు వర్తించడంలేదన్నారు. అప్పులు, వడ్డీల భారాలు భరించలేక పేద, మధ్య, కౌలు తరగతి రైతులు ఎక్కువగా ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. ప్రయివేటు వ్యాపారుల వల్ల రైతులు వరి, పత్తి, పప్పు ధాన్యాలు, నూనెగింజల అమ్మకంలో ఏటా 5 వేల కోట్ల నష్టపోతున్నారన్నారు. రైతాంగం పడే ఇబ్బందులను రాష్ట్ర మహాసభలలో చర్చించి భవిష్యత్ పోరాటాలకు రూపకల్పన చేస్తామని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పి. జంగారెడ్డి, నంద్యాల నర్సింహారెడ్డి, బొంత చంద్రారెడ్డి, అరిబండి ప్రసాదరావు, మన్నా నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శులు మాదినేని రమేష్, గొల్లపల్లి జయరాజు, మోకు కనకారెడ్డి, నక్కా యాదవరెడ్డి, మంగ నర్సింహ్మా, కున్‌రెడ్డి నాగిరెడ్డి, మద్దిరాజు శ్రీనివాస్, మూడ్ శోభన్, డి. బాల్‌రెడ్డి, లెల్లల బాలకృష్ణ పాల్గొన్నారు.

చెరువులో పడి ముగ్గురు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాలనీలో నెలకొన్న నీటి సమస్య ముగ్గురి ప్రాణాలను బలిగొంది. మూడ్రోజులుగా కాలనీలో నీటి కొరత ఉండటంతో తల్లీకూతుళ్లు బట్టలు ఉతికేందుకు వెళ్లి కాలుజారి చెరువులో పడి మృతిచెందారు. కాగా చెల్లి మృతదేహం లభ్యం కాకపోవడంతో.. గాలింపు కోసం వెళ్లిన సోదరుడు సైతం నీటిలో గల్లంతై మరణించారు ఈ ఘోర విషాదకర ఘటన సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. సిఐ శ్రీనివాసులు రెడ్డి, మృతుల కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్‌పూర్ మండలం నర్రెగూడెం జెఎన్ఎన్ యుఆర్ఎం ఇంటిలో జమ్మయ్య, యాదమ్మ(38) దంపతులు వారి ఇద్దరు కూతుళ్లు లావణ్య(14), నందినితో కలిసి నివసిస్తున్నారు. అయితే మూడ్రోజులుగా కాలనీలో నీటి సరఫరా లేకపోవడంతో.. బట్టలు ఉతికేందుకు తన చిన్న కూతురు లావణ్యతో కలిసి దగ్గరలోని ఐలాపూర్ ఈర్ల చెరువు వద్దకు శనివారం మధ్యాహ్నం యాదమ్మ వెళ్లింది. బట్టలు ఉతికిన అనంతరం చెరువు దాటే క్రమంలో తల్లీ కూతురు కాలు జారీ నీటిలో పడి మృతి చెందారు. అయితే ఆదివారం ఉదయం లావణ్య మృతదేహం లభ్యమైంది. యాదమ్మ మృతదేహం లభ్యం కాకపోవడంతో.. ఆమె సోదరుడు తర్పోలు ఉసిరయ్య నీటిలోకి దిగి గాలించే ప్రయత్నం చేస్తూ..అతడూ గల్లంతయ్యాడు. దాంతో గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టగా.. ఉసిరయ్య మృతదేహం లభ్యమైంది. యాదమ్మ మృతదేహం కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఉసిరయ్యకు భార్య రాములమ్మ, ఇద్దరు కూతుళు ,, కుమారులు ఉన్నారు. యాదమ్మ భర్త జమ్మయ్య ఐలాపూర్ తండాలో వాటర్ లైన్‌మెన్‌గా పనిచేస్తున్నారు. సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు మెంబర్లు ఉదయం నుంచి దగ్గరుండి గాలింపు చర్యలను పర్యవేక్షిస్తున్నారు.

నూతన విద్యావిధానం రద్దు కోసం పోరాటం

భారత విద్యా హక్కు సంస్థ చైర్మన్ జగ్మోహన్‌సింగ్




ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న ఫాసిస్టు, నూతన విద్యావిధానాలకు వ్యతిరేకంగా జాతీయ స్థాయిలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని భారత విద్యా హక్కు వేదిక (ఎఐఎఫ్ఆర్‌టిఇ) చైర్మెన్ జగ్మోహన్‌సింగ్ ప్రకటించారు. హైదరాబాద్‌లోని మోంట్‌ఫోర్ట్ సోషల్ ఇనిస్టిట్యూట్‌లో ఈ నెల 11,12,13 తేదీల్లో ఎఐఎఫ్ఆర్‌టిఇ జాతీయ కౌన్సిల్ సమావేశాలు జరిగాయి. అందులో ఆ సంస్థ చైర్మెన్‌గా జగ్మోహన్‌సింగ్, వైస్‌చైర్మెన్‌గా ప్రొఫెసర్ చక్రధర్‌రావు ఎన్నికయ్యారు. ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జగ్మోహన్ సింగ్ మాట్లాడారు. దేశంలో రోజురోజుకీ విద్యావ్యవస్థ నిర్వీర్యం అయిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. చక్రధర్‌రావు మాట్లాడుతూ నూతన జాతీయ విద్యావిధానాన్ని తెలంగాణలో అమలు చేయవద్దని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక విద్యావిధానాన్ని రూపొందించాలని కోరారు. ఏఐఎఫ్ఆర్‌టీఈ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ వి ప్రసాద్ మాట్లాడుతూ నూతన జాతీయ విద్యావిధానం, ప్రయివేటు వర్సిటీలు, విద్యాసంస్థలతో పేదలు, దళితులు చదువులకు దూరం అవుతున్న పరిస్థితి నెలకొందన్నారు. ఆ వేదిక అధ్యక్షవర్గ సభ్యులు ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ విద్యావ్యవస్థ దేశంలో నిర్వీర్యం అవుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు అనుసరిస్తున్న విధానాల వల్ల దేశంలోని ఒక వర్గం పూర్తిగా చదువులకు దూరం అయ్యే ప్రమాదం ముంచుకొస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను రక్షించుకోవాల్సిన బాధ్యత నేటి యువతపై ఉందని నొక్కి చెప్పారు. ఆ వేదిక అధికార ప్రతినిధి ప్రొఫెసర్ మధుప్రసాద్ మాట్లాడుతూ వామపక్ష, ప్రజాతంత్ర, ప్రతిపక్ష పార్టీలు ముందుకు వచ్చి ప్రజావ్యతిరేక విద్యావిధానాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య పోరాట లక్ష్యాలకు అనుకూలమైన విద్యావిధానాన్ని తీసుకురావాలని కోరారు. వేదిక తెలంగాణ కార్యనిర్వాహక కార్యదర్శి ప్రొఫెసర్ లక్ష్మినారాయణ మాట్లాడుతూ ఈ విద్యావిధానాన్ని రద్దు చేయాలనీ, ప్రొఫెసర్ ఆనంద్ తెల్‌తుంబ్డేను విడుదలచేయాలనీ, పది శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను రద్దు చేయాలనీ, విద్యార్థి, ఉపాధ్యాయ ఉద్యమాలపై దాడులను ఆపాలనీ, నర్మదా జీవనశాలపై దాడులను ఖండిస్తూ తీర్మానాలు చేశామని చెప్పారు.

మధుమేహ సంరక్షణ కోసం నూతన విధానం

- శ్రీకారం చుట్టిన రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చిన్నారుల్లో మధుమేహ సంరక్షణ కోసం రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సిబ్బందిలో అవగాహన కల్పించేందుకు ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా రెయిన్‌బో ఆస్పత్రి వారు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడియాట్రిక్ ఎండోక్రినాలజిస్ట్ డాక్టర్ లీనాత రెడ్డి మాట్లాడుతూ.. పిల్లలు పాఠశాలలో ఈ మధుమేహ స్వీయ-సంరక్షణ చేస్తున్నప్పుడు, వారికి పాఠశాల సిబ్బంది నుండి సహాయం, మద్దతు అవసరమన్నారు. చిన్నారుల రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సి ఉంటుందన్నారు.

ఇన్సులిన్ ఇంజిక్షన్లు సమయానికి ఇవ్వాల్సి ఉంటుందన్నారు. పాఠశాల సిబ్బందికి, తల్లిదండ్రులకు తగిన శిక్షణ ఇస్తామని చెప్పారు. ముఖ్య అతిధులుగా నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్ స్టేట్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ జగన్నాథ్ రెడ్డి, స్టేట్ కార్డియోవాస్కులర్ హెల్త్ ఆఫీసర్ శ్రావణ్ కుమార్ రెడ్డి హాజరయ్యారు.

రాజకీయ దురుద్దేశంతోనే మోడీ పర్యటన

- సింగరేణిని బతికుండగానే చంపుతున్న వైనం
- సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాజకీయ దురుద్దేశంతోనే తెలుగు రాష్ట్రాల్లో మోడీ పర్యటించారనీ, ఆయన పర్యటనల వల్ల ఇరు రాష్ట్రాలకు ఉపయోగంలేదని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ చెప్పారు. ఆ పార్టీ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి, ఇటి నర్సింహతో కలిసి ఆదివారం హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్, ప్రయివేటీకరణ విధానాలతో సింగరేణి సంస్థను బతికి ఉండగానే చంపేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. జలగలాగా మోడీ ప్రభుత్వం సింగరేణి సంస్థ రక్తాన్ని పీలుస్తోందని విమర్శించారు. అవినీతి కుంభకోణాలకు మోడీ ప్రభుత్వమే నాయకత్వం వహిస్తోందని చెప్పారు. అదానీ ఆస్తుల పెరుగుదలే ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యమని చెప్పారు. మునుగోడులో బిజెపి ఓడిపోయిన నేపథ్యంలో ఆ పార్టీ శ్రేణులు నిరాశపడకుండా ఉండేందుకే మోడీ రాష్ట్ర పర్యటన చేపట్టారని చెప్పారు. సింగరేణి సంస్థను కేంద్రం ప్రయివేటు పరం చేయటం కుదరదు కాబట్టే..దాన్ని బతికుండగానే చంపేందుకు కుట్ర చేస్తోందన్నారు. 2015లో గోదావరి పరివాహక ప్రాంతంలోని బొగ్గుబావిని సింగరేణికి ఇవ్వాలనే మైన్స్ మినరల్స్ డెవలప్ రెగ్యులేషన్ చట్టాన్ని 2015లో సవరించి, కమర్షియల్ మైనింగ్‌కు అనుమతినిచ్చారనీ, తద్వారా ఇప్పటికే 240 మైన్‌లను ప్రయివేటుకు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారని తెలిపారు. ఇప్పటికే 98 మైన్‌లు ప్రయివేటు వ్యక్తులకు కేటాయించారన్నారు. ఇందులో బిజెపి నేత కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికీ ఇచ్చారని చెప్పారు. సింగరేణి పరిధిలోని బొగ్గు బావులను ప్రయివేటుకు అప్పగించిన తర్వాత సింగరేణి ఉత్పత్తి తగ్గిపోతుందని చెప్పారు. దీంతో ఆ సంస్థ బతికుండగానే చంపటం కాదా? అని ప్రశ్నించారు.

పసికందును కడతేర్చిన తల్లి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మతిస్థిమితం సరిగా లేని తల్లి తన ఐదు నెలల పసికందును బావిలో పడేసి కడతేర్చారు.. ఈ ఘటన నారాయణపేట జిల్లా కోస్గి పట్టణ కేంద్రంలో ఆదివారం జరిగింది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ కేంద్రంలోని హరిజనవాడకు చెందిన గోవిందుకు ఇద్దరు భార్యలు. మొదటి భార్యకు కొడుకు, కూతురు సంతానం. రెండో భార్య ఆశమ్మ మూగది. ఐదు నెలల కిందట మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఆమెకు మతిస్థిమితం సరిగ్గా లేదు. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున పసిబిడ్డను బావిలో పడేసింది. ఉదయం కుటుంబ సభ్యులు బిడ్డ కోసం వెతికారు. జాడ తెలియకపోవడంతో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆశమ్మపై అనుమానంతో పోలీస్ స్టేషన్ తరలించి విచారణ చేపట్టారు. సైగలతో బిడ్డను బావిలో పడేసినట్టు చెప్పింది. దాంతో ఘటనాస్థలానికి ఆమెను తీసుకొస్తే.. బావిలోకి చూపించింది. స్థానికుల సహాయంతో పోలీసులు పసిబిడ్డ మృతదేహాన్ని పైకి తీశారు.

మాజీ ఎమ్మెల్యే 'మందాడి' మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



మందాడి సత్యనారాయణరెడ్డి (ఫైల్)

కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ ఎమ్మెల్యే, బిజెపి సీనియర్ నేత మందాడి సత్యనారాయణరెడ్డి ఆదివారం ఉదయం హన్మకొండలోని ఆయన స్వగృహంలో మృతిచెందారు. 2004 ఎన్నికల్లో నాటి హన్మకొండ నియోజకవర్గం నుంచి టిఆర్ఎస్ అభ్యర్థిగా మందాడి సత్యనారాయణరెడ్డి విజయం సాధించారు. అనంతరం ఆయన టిఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతిచ్చారు. ఎమ్మెల్యే పదవీకాలం ముగిశాక బిజెపిలో చేరారు. బిజెపితో తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన మందాడి.. ఆ పార్టీలో రాష్ట్ర ఉపాధ్యక్షునిగా ఎదిగారు. తెలంగాణ ఉద్యమ సమయంలో బిజెపిని వీడి టిఆర్ఎస్‌లో చేరారు. ప్రస్తుతం బిజెపి తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ శాశ్వత ప్రత్యేక ఆహ్వానితులుగా ఉన్నారు. 'మందాడి' మృతి పట్ల బిజెపి నేతలు ఎం. ధర్మారావు, గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, రావు పద్మ ప్రగాఢ సంతాపం ప్రకటించారు.

'మందాడి' మృతి తీరని లోటు : గవర్నర్ బండారు దత్తాత్రేయ

మాజీ ఎమ్మెల్యే మందాడి సత్యనారాయణరెడ్డి సమాజ సేవకుడు, జాతీయ భావాలతో రైతుల కోసం నిస్వార్థంగా పనిచేసిన నేత అని, అలాంటి నేతను కోల్పోవడం బాధాకరమని, ఆయన మృతికి హర్యాన గవర్నర్ బండారు దత్తాత్రేయ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు.

బిజెపి బడా జుమ్లా పార్టీ

గుజరాత్ ఎన్నికల కోసం 1.35 లక్షల కేంద్రం నిధులు

తెలంగాణకు చేసిందేమీ లేదు : బాల్క సుమన్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

బిజెపి అంటే బడా జుమ్లా పార్టీ అని ప్రభుత్వ విప్, టిఆర్ఎస్ ఎమ్మెల్యే బాల్క సుమన్ విమర్శించారు. రాజకీయ లబ్ది కోసం గుజరాత్‌కు కేంద్ర ప్రభుత్వం 1.35 లక్షల కోట్ల నిధులను కేటాయించిందన్నారు. తెలంగాణకు మోడీ సర్కారు చేసిందేమీ లేదని విమర్శించారు. హైదరాబాద్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. మోడీ తన నయవంచన మాటలతో రాష్ట్ర ప్రజలను మరోమారు మోసం చేశారన్నారు. తెలంగాణ ప్రజలపై ప్రేమ ఉంటే ప్రాజెక్టులకు జాతీయ హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. మెడికల్ కాలేజీలు ఇవ్వాలనీ, నవోదయ విద్యాలయాలు పెట్టాలని కోరారు. తెలంగాణ ప్రగతిని చూసి ఓర్వలేక, ప్రధాని మోడీ విషం కక్కుతున్నాడని విమర్శించారు. ఇప్పటికే ఎనిమిది రాష్ట్రాల్లో ప్రభుత్వాలు పడగొట్టిన బిజెపి, తెలంగాణలోనూ ప్రయత్నిస్తే బిజెపి ఏజెంట్లను జైల్లో పెట్టామన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లోనే కమీషన్లు ఉన్నాయనీ, కర్ణాటకలో కమీషన్లు ఇవ్వలేక కాంట్రాక్టర్ ఆత్మహత్య చేసుకున్నడని గుర్తుచేశారు. రాజగోపాల్ రెడ్డికి ఎరవేసి కృత్రిమంగా ఉప ఎన్నికలు తెస్తే.. ప్రజలు అద్భుతమైన తీర్పుతో టిఆర్ఎస్‌ను గెలిపించారన్నారు. మీడియా దృష్టిని మరల్చేందుకే 14 నెలల క్రితమే ప్రారంభమై 68 కోట్ల లాభాలు గడించిన రామగుండం ఎరువుల ఫ్యాక్టరీని మోడీ మళ్లీ ప్రారంభించారని విమర్శించారు. తెలంగాణలో రైతులు పండించిన వడ్లను కొనలేని మోడీ సర్కారు రైతుల గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. నాలుగు బొగ్గుబ్లాకులను వెంటనే సింగరేణికి కేటాయించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో తీర్మానం చేసిన మేరకు సింగరేణి కార్మికులకు ఆదాయపు పన్ను మినహాయింపు ఇవ్వాలని కోరారు. నిటిఆయోగ్ సిఫార్సుల ప్రకారం మిషన్ కాకతీయకు రూ.ఐదు వేల కోట్లు, మిషన్ భగీరథకు రూ.19 వేల కోట్ల నిధులను కేంద్రం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నిలిచిన 'పాలమూరు రంగారెడ్డి' పనులు

- మొదటి దశ పూర్తి కాలేదు..
- రెండో దశ ప్రారంభమే కాలేదు
- ఆరు నెలలుగా ఆగిపోయిన పనులు
- రూ.వెయ్యి కోట్లకు పైగా పెండింగ్ బిల్లులు



ఎక్కడికక్కడ ఆగిపోయిన ఎత్తిపోతల పథకం పనులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిర్మాణ దశలో ఉన్న ప్రాజెక్టులన్నీ పూర్తయితే బీడు భూములన్నీ సిరులు కురిపిస్తాయి.. పచ్చని పొలాలతో పాలమూరు జిల్లా కళకళలాడుతుంది. కానీ.. నాగర్‌కర్నూల్, నారాయణపేట, మహబూబ్‌నగర్ జిల్లాలకు వరప్రసాయినిగా చెబుతున్న పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. ప్రాజెక్టు మొదటి దశ పూర్తికాలేదు. రెండో దశ మొదలు కాలేదు. చేసిన పనులకు బిల్లులూ రాలేదు. భూసేకరణ.. పనులు జరగకపోవడం వల్ల కాంట్రాక్టర్లు వాహనాలను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. కోర్టు చిక్కులు వీడితే తప్ప ప్రాజెక్టు పనులు ముందుకు జరిగేలా కనిపించడం లేదని అధికార వర్గాలు అంటున్నాయి. కేంద్రం కూడా మెలికలు పెట్టకుండా ఉండాల్సిన అవసరం ఉందంటున్నాయి.

పాలమూరు -రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. ఒక 18 ప్యాకేజీలోనే 150 వాహనాలు, 300 మంది సిబ్బందిని ఇతర పనులకు తరలించారు. మొదటి దశలో నార్లాపూర్, ఏదుల వట్టెం, కరివేన, ఉద్దండపూర్, లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్లను పూర్తి చేయాల్సి ఉంది. ఇప్పటివరకు నార్లాపూర్, ఏదుల తప్ప మరేదీ పూర్తికాలేదు. సంపు పంప్‌హౌస్ పనులు సైతం నిలిచిపోయాయి. కరివేన గొట్టం, ఉద్దండపూర్ రిజర్వాయర్ల దగ్గర భూసేకరణ చేయకపోవడంతో పనులు నిలిపేశారు. గొట్టం రిజర్వాయర్ సమీపంలో వందెకరాలకు సంబంధించి భూసేకరణ పరిహారం ఇవ్వకపోవడం వల్ల రైతులు పనులు జరగనివ్వడం లేదు. కుడికిల్ల, ఉద్దండపూర్, కరివేన రిజర్వాయర్ల పరిధిలో భూసేకరణ చేయకపోవడం వల్ల పనులు ముందుకు సాగడం లేదు. చేసిన పనులకు వెయ్యి కోట్లకు పైగా బిల్లులు రావాల్సి ఉంది. దీంతో కాంట్రాక్టర్లు పనులు ఆపేసి ఇతర ప్రాంతాలకు తమ సిబ్బందిని, వాహనాలను తరలిస్తున్నారు.

మొదటి దశలో 18 ప్యాకేజీలలో జరుగుతున్న పనులు పూర్తిగా నిలిచిపోయాయి. కాల్వ టన్నెల్ పంప్‌హౌస్ రిజర్వాయర్లు, పవర్ మోటార్ల పనులు సాగడం లేదు. ఇక రెండో దశలో చేపట్టాల్సిన పనుల ఊసే లేదు. రెండో దశలో నారాయణపేటలో కోస్గి, మద్దూరు, నారాయణపేట, ధన్వాడ దామరగిద్ద, మరికల్, ఊట్కూరు పరిధిలో ప్రధాన కాలువలు తీయాల్సి ఉంది. మహబూబ్‌నగర్లో, హన్వాడ, జడ్చర్ల, రాజాపూర్, బాలానగర్, మిడ్జిల్, నవాపేట, అడ్డాకుల, దేవరకద్రమండల పరిధిలో కాల్వలు తీయాల్సింది. నాగర్‌కర్నూల్ జిల్లాలో వంగూరు, బిజినపల్లి, తిమ్మాజీపేట, తాడూరు, ఊరుకొండ, కల్వకుర్తి, వెల్దండ మండలాల పరిధిలో కాల్వ తీస్తే తప్ప సాగునీరు ఇచ్చే అవకాశం లేదు. మూడు జిల్లాల పరిధిలో 13 ప్రధాన కాలువలు 915 కిలోమీటర్లు తీయాల్సి ఉంది. డిస్ట్రిబ్యూటర్లను సైతం ఏర్పాటు చేయాల్సి ఉంది. రెండో దశ పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సర్వేలు చేపట్టింది. కాలుష్య నియంత్రణ మండలి అనుమతులను కోరింది. ఇప్పటివరకు ఎటువంటి అనుమతులూ రాలేదు.

ప్రాజెక్టు పూర్తయితే పాలమూరు -రంగారెడ్డి ఎత్తిపోతల పనులు పూర్తయితే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతోపాటు రంగారెడ్డి, నల్లగొండ, వికారాబాద్ జిల్లాలకు సాగునీరు, హైదరాబాదుకు తాగునీరు పుష్కలంగా అందుతుంది.

ఆరు ప్రధాన రిజర్వాయర్ల ద్వారా 67.95 టీఎంసీల నీరు నిల్వ చేసుకునే అవకాశం ఉంది. ఇంకా అనేక రిజర్వాయర్లు ఏర్పాటు చేసుకోవాలి. నిర్వాసితులకు భూమికి పరిహారం, ఇంటికో ఉద్యోగం కల్పిస్తామని హామీలు ఇచ్చారు. నిర్వాసితులకు హామీలు అమలు చేస్తేనే పనులు ముందుకు సాగే అవకాశాలున్నాయి. 12వ ప్యాకేజీలో రూ.430 కోట్లతో పనులు ప్రారంభించారు. బిల్లులు రాక పనులు జరగకపోవడంతో అక్కడ ఉన్న 50 వాహనాలను, 300 మంది సిబ్బందిని ఇప్పటికే వివిధ ప్రాంతాలకు తరలించారు.

పనులు ఎలా చేయాలి..
- కాంట్రాక్టర్ రమేష్

మేము రూ.430 కోట్లతో ఇక్కడ పనులు నిర్వహిస్తున్నాం. వివిధ కారణాల చేత ఆరు నెలలుగా పనులు ఆగిపోయాయి. ఒకవైపు రైతులు పరిహారం ఇవ్వలేదని పనులు నిలిపేస్తున్నారు. మరోవైపు పనులు నిలిపేయాలని గ్రీన్ ట్రిబ్యునల్ చెబుతోంది. ఇటు రైతులు, అటు కోర్టుల మధ్య చిక్కుకునిపోయాం. ముఖ్యంగా ప్రభుత్వం నుంచి రావాల్సిన బిల్లులు సైతం సకాలంలో రావడం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో పనులు ఎలా నిర్వహించాలి.

నేడు అపోలోలో అతిపెద్ద షుగర్ చెక్ డ్రైవ్

హైదరాబాద్ : ప్రముఖ హెల్త్‌కేర్ సర్వీసెస్ ప్రొవైడర్ అయిన అపోలో హాస్పిటల్స్ నవంబర్ 14న ప్రపంచ మధుమేహ దినోత్సవం (వరల్డ్ డయాబెటిస్ డే)ను పురస్కరించుకుని ప్రపంచంలోనే అతిపెద్ద వన్డే షుగర్ చెక్ డ్రైవ్‌ను నిర్వహించనున్నట్లు తెలిపింది. సోమవారం తమ పలు వేదికల ద్వారా మొత్తం ఎనిమిది గంటల్లో అత్యధిక బ్లడ్ గ్లూకోజ్ స్థాయి పరీక్షలు చేసి గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌ను బద్దలు కొట్టాలని హాస్పిటల్ గ్రూప్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొంది. ప్రజలు తమ సమీపంలో ఉండే అపోలో హాస్పిటల్స్‌లో, 170కు పైగా అపోలో క్లినిక్‌లు, 1200 అపోలో ఫార్మసీలలో ఉచితంగా రాండమ్ బ్లడ్ షుగర్ టెస్ట్ కోసం సంప్రదించవచ్చని తెలిపింది. "వరల్డ్ డయాబెటిస్ డే రోజున డయాబెటిస్ కోసం రక్తంలో చక్కెర పరీక్షలను రికార్డు స్థాయిలో నిర్వహించాలనే లక్ష్యంతో మా ఉద్దేశ్యం డయాబెటిస్, దాని ప్రభావంపై దష్టి సారించడం. డయాబెటిస్ నిశ్శబ్ద సునామీని ఎదుర్కొంటున్న భారతదేశం అధిక ప్రమాదంలో ఉంది. నిర్ధారణ చేయని డయాబెటిస్‌తో జీవిస్తున్న అనేక మంది వ్యక్తులను ఈ రికార్డు టెస్ట్‌ల ప్రయత్నం వెలుగులోకి తెస్తుంది." అని అపోలో హాస్పిటల్స్, గ్రూప్ చైర్మన్ డాక్టర్ ప్రతాప్ సి రెడ్డి పేర్కొన్నారు.

మంత్రి ఎర్రబెల్లి సమక్షంలోనే.. మహబూబాబాద్‌లో ఎమ్మెల్యే, ఎంపీల మధ్య రచ్చ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహబూబాబాద్ జిల్లాకేంద్రంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సాక్షిగా ఎమ్మెల్యే శంకర్‌నాయక్, టిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, ఎంపి కవిత మధ్య విభేదాలు మరోమారు భగ్గుమన్నాయి. కలెక్టర్ కార్యాలయం, మెడికల్ కాలేజీ, టిఆర్ఎస్ జిల్లా కార్యాలయం ప్రారంభానికి సిఎం కెసిఆర్ రానున్న నేపథ్యంలో మంత్రులు దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్‌లతోపాటు ఏర్పాట్ల పరిశీలనలో భాగంగా ఈ సంఘటన చోటు చేసుకుంది. వీరిద్దరి మధ్య కొన్నేళ్లుగా ఆధిపత్య సాగుతున్న పోరు మరోసారి బయటపడింది. టిఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయం పనులను పరిశీలిస్తున్న క్రమంలో ఇద్దరి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. పరస్పరం విమర్శలు గుప్పించుకోవడంతో అసలేం జరుగుతుందో అర్థం కాలేదు. ఈ క్రమంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు జోక్యం చేసుకొని ఇద్దరిని సర్దుబాటు చేశారు. గతంలోనూ వీరిద్దరి మధ్య బహిరంగంగానే విభేదాలు బయటపడ్డ సందర్భాలూ లేకపోలేదు. ఈ వివాదం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

మహబూబాబాద్ జిల్లాకేంద్రంలో సమీకృత జిల్లా కలెక్టరేట్ సముదాయంతోపాటు, మెడికల్ కాలేజీ, టీఆర్ఎస్ జిల్లా కార్యాలయం భవనాలు ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్‌లతోపాటు జడ్పీ చైర్‌పర్సన్ బిందు, మాజీ డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్యే బానోతు శంకర్‌నాయక్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా టీఆర్ఎస్ జిల్లా కార్యాలయం పనులు పరిశీలిస్తున్న క్రమంలో ఎమ్మెల్యే శంకర్‌నాయక్ ఈ పనులన్నీ సొంత డబ్బులతో పూర్తి చేయించినట్టు మంత్రి దయాకర్‌రావుకు వివరించారు. దీనిపై తీవ్రంగా స్పందించిన టీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, ఎంపీ కవిత జిల్లా పార్టీ కార్యాలయ నిర్మాణానికి పార్టీ నిధులను సమకూర్చిందని ఎమ్మెల్యే వాదనను తీవ్రంగా ఖండించారు. ఈ క్రమంలో ఈ పనులు చేసిన గుత్తేదారు కేఎల్ రెడ్డి పార్టీ ఇచ్చిన నిధులతోనే భవన నిర్మాణం చేపట్టామని చెప్పారు. దాంతో ఎంపీ, ఎమ్మెల్యే మధ్య వాగ్వివాదం చోటు చేసుకోవడంతో మంత్రి దయాకర్‌రావు ఇద్దరిని శాంతింపచేశారు. కాగా, గతంలో కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు మాలోత్ కవిత మహబూబాబాద్ ఎమ్మెల్యేగా ఒక పర్యాయం గెలుపొందారు. అనంతరం ఆమె టీఆర్ఎస్‌లో చేరారు. గత ఎన్నికల్లోనూ మహబూబాబాద్ టీఆర్ఎస్ ఎమ్మెల్యే టికెట్ ఆశించారు. పార్టీ నాయకత్వం కవితకు ఎంపీ టికెట్ ఇచ్చి జిల్లా పార్టీ అధ్యక్షురాలిగా నియమించారు. అయినా వీరిరువురి మధ్య విభేధాలు కొనసాగుతూనే ఉన్నాయి. వచ్చే శాసనసభ ఎన్నికల్లోనూ మహబూబాబాద్ టీఆర్ఎస్ ఎమ్మెల్యే టికెట్‌ను కవిత ఆశిస్తుండటంతో ఎమ్మెల్యే శంకర్‌నాయక్ ఎంపీ పట్ల అప్రమత్తంగా ఉంటున్నారు. గతంలో పార్టీ కార్యక్రమంలోనూ వీరిద్దరి మధ్య కార్యకర్తల సమక్షంలోనే వాగ్వివాదం జరిగింది. సీఎం పర్యటన ముందస్తు ఏర్పాట్లలో మళ్లీ వీరిద్దరి మధ్య విభేధాలు బహిర్గతం కావడంతో మంత్రులు ఈ విషయంపై దృష్టిసారించే అవకాశం లేకపోలేదు.



ధర్నా చేస్తున్న యువజన సంఘాల నాయకులు

ఎమ్మెల్యే రసమయి కాన్వాయ్‌పై దాడి..

- కవ్వంపల్లి సహా పలువురు అరెస్ట్
- తిమ్మాపూర్ పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత
- దాడిని ఖండించిన వినోద్‌కుమార్, జివి రామకృష్ణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కాన్వాయ్‌పై పలు యువజన సంఘాల నాయకులు దాడికి పాల్పడ్డారు. కరీంనగర్ జిల్లా గుండ్లపల్లె నుంచి పొత్తూరు వరకు డబుల్ రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేస్తూ.. గుండ్లపల్లి రాజీవ్ రహదారిపై పలు యువజన సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం మహాధర్నా చేపట్టారు. ఈ ధర్నాకు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు డా కవ్వంపల్లి సత్యనారాయణ మద్దతుగా నిలిచారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ బెజ్జంకి పర్యటనకు వెళ్తుండగా, కాన్వాయ్‌ను గమనించిన యువజన సంఘాల నాయకులు ఒక్కసారిగా దాడికి పాల్పడ్డారు. రసమయి బాలకిషన్ కారుపై పిడి గుద్దులు గుద్దుతూ, ఎమ్మెల్యే రాజీనామా చేయాలని నినదిస్తూ కారును వెంబడించారు. దీంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొనగా, పోలీసులు లాఠీచార్జి చేశారు. అనంతరం యువజన సంఘ నాయకులతో పాటు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణను పోలీసులు అదుపులోకి తీసుకుని ఎల్ఎండి స్టేషన్‌కు తరలించారు.

కావాలనే దాడులను ప్రేరేపిస్తున్నారు
బోయినిపల్లి వినోద్‌కుమార్

ఎమ్మెల్యే రసమయిపై జరిగిన దాడిని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినిపల్లి వినోద్‌కుమార్ ఖండించారు. రసమయి ఉద్యమకాలం నుంచి పార్టీలో పనిచేస్తున్నాడని, ఆనాటి నుంచే ఇలాంటి దాడులను ఎన్నో ఎదుర్కొన్నామని అన్నారు. కొందరు కావాలనే దాడులను ప్రేరేపిస్తున్నారని చెప్పారు. పార్టీ కార్యకర్తలు ప్రతిదాడులకు దిగొద్దని, సంయయనం పాటించాలని సూచించారు.

దాడిని ఖండిస్తున్నాం.. : జివి రామకృష్ణ

కవ్వంపల్లిని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా నియమించింది పార్టీని అభివృద్ధి చేసేందుకా..? యువకులను గుండాలుగా మార్చేందుకా అని టిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జివి రామకృష్ణ ప్రశ్నించారు. రసమయిపై దాడి అనంతరం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దమ్ము ధైర్యం ఉంటే ప్రజాక్షేత్రంలో చూసుకుందామా అంటూ సవాల్ విసిరారు. కవ్వంపల్లి ఓ పొలిటికల్ బ్రోకర్ అని, నియోజకవర్గంలో రసమయికి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకే ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడికి జిల్లాపై ఎలాంటి ప్రేమ లేదని విమర్శించారు. కుల, మతాల పిచ్చి తప్ప అభివృద్ధిపై ధ్యాస లేదని ఆరోపించారు.

ఫిల్మ్‌నగర్‌లో అక్రమ నిర్మాణాలు కూల్చివేత

నందకుమార్ హోటల్ సైతం..

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



హైదరాబాద్ ఫిల్మ్‌నగర్‌లో అక్రమ నిర్మాణాలను జిహెచ్ఎంసి టౌన్‌ప్లానింగ్ అధికారులు ఆదివరం కూల్చివేశారు. స్థానికంగా ఉన్న దక్కన్ హోటల్‌లో కొంత భాగం అనుమతి లేకుండా నిర్మించారని అధికారులు జూబ్లీహిల్స్ పోలీసుల సహకారంతో కూల్చేశారు. దక్కన్ హోటల్.. ఇటీవల టిఆర్ఎస్ ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో నిందితుడిగా ఉన్న నందకుమార్ నడుపుతున్నారు. ఈ హోటల్ స్థలాన్ని సినీ నిర్మాత దగ్గుబాటి సురేష్‌బాబు కుటుంబ సభ్యుల నుంచి లీజుకు తీసుకొని నడుపుతున్నట్టు సమాచారం. ప్రస్తుతం నందకుమార్ జైలులో ఉన్నాడు.

ఎమ్మెల్యేల కొనుగోలు కేసు... త్వరలో మరిన్ని అరెస్టులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో సిట్ బృందం ఇతర రాష్ట్రాల్లో సోదాలు నిర్వహిస్తోంది. దర్యాప్తులో లభించిన సమాచారం ఆధారంగా ఆంధ్రప్రదేశ్, హరియాణా, కేరళ, కర్ణాటకతో పాటు హైదరాబాద్‌లోనూ సిట్ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. మొత్తం ఏడు బృందాలుగా విడిపోయి సోదాలు నిర్వహిస్తున్న సిట్ అధికారులు.. హరియాణాలో రామచంద్రభారతి నివాసంతో పాటు కర్ణాటకలో ఆయనకు సంబంధించిన ఇంటిలోనూ సోదాలు నిర్వహించినట్లు తెలిసింది. తిరుపతిలో సింహయాజికి చెందిన ఆశ్రమానికి మరో బృందం వెళ్లి సోదాలు చేసింది. హైదరాబాద్‌లోని నందకుమార్‌కు చెందిన ఇల్లు, హొటల్‌లో సోదాలు నిర్వహించారు. కేరళలోని కొచ్చిలో ఉండే ఓ వైద్యుడు రామచంద్రభారతికి మధ్యవర్తిగా వ్యవహరిస్తున్నట్టు సిట్ అధికారులు గుర్తించారు. దీంతో వైద్యుడి ఇంట్లోనూ సోదాలు చేశారు. పలు కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. ఓ జాతీయ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధి బంధువు తిరుపతి నుంచి హైదరాబాద్ రావడానికి సింహయాజీకి విమానం టికెట్ బుక్ చేసినట్టు సిట్ గుర్తించింది. దర్యాప్తులో భాగంగా సోదాల అనంతరం మరికొంత మందిని అరెస్టు చేసే అవకాశముంది. హైదరాబాద్‌లో నందకుమార్‌కు చెందిన పలు ప్రాంతాల్లో సిట్ అధికారులు ఆదివారమూ సోదాలు నిర్వహించారు. ఫిల్మ్‌నగర్ ఆదిత్య హిల్‌టాప్ అపార్ట్‌మెంట్‌లోని ఆరో అంతస్తులో ఉన్న నందకుమార్ ఇంట్లో దాదాపు ఆరు గంటలపాటు సోదాలు చేశారు. ఆ సమయంలో నందకుమార్ భార్య, కుమారుడు ఇంట్లో ఉన్నారు. ఇల్లంతా గాలించిన పోలీసులు పలు పత్రాల్ని తీసుకెళ్లినట్లు తెలిసింది. కొంతకాలంగా ఆ ఇంటికి ఎవరెవరు వచ్చారనే కోణంలో సీసీ కెమెరాల ఫుటేజిని పరిశీలించినట్లు సమాచారం. చైతన్యపురి, ఫిల్మ్‌నగర్‌లలోనూ మరో రెండు బృందాలు సోదాలు చేశాయి. చైతన్యపురిలో నందకుమార్ తల్లిదండ్రులు నివసించే ఇంటితో పాటు ఫిల్మ్‌నగర్ కూడలిలోని అతడి హొటల్ దక్కన్ కిచెన్‌లో శనివారం రాత్రి పొద్దుపోయే వరకు సోదాలు కొనసాగాయి.



రైతు గర్జన మహాసభలో మాట్లాడుతున్న మోహిని మోహన్ మిశ్రా

రైతుల పంటలను లాభసాటి ధరకు కొనుగోలుచేయాలి

- భారతీయ కిసాన్ సంఘ్ అఖిల భారత ప్రధాన కార్యదర్శి మోహిని మోహన్ మిశ్రా
- బికెఎస్ ఆధ్వర్యంలో రైతు గర్జన బహిరంగ సభ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రైతులు పండించిన పంటల ఉత్పత్తులను లాభసాటి ధరకు కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని భారతీయ కిసాన్ సంఘ్ అఖిల భారత ప్రధాన కార్యదర్శి మోహిని మోహన్ మిశ్రా డిమాండ్ చేశారు. సికింద్రాబాద్‌లోని పెరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం బికెఎస్ ఆధ్వర్యంలో రైతు గర్జన మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంజాబ్, హర్యానా రాష్ట్రాల మీద ఉన్న ప్రేమ ఇక్కడి రైతులపై తెలంగాణ సిఎంకు లేదని విమర్శించారు. క్వింటాల్ వడ్లకు పది కేజీలు తాలు పేరుతో నష్టం చేస్తున్న కెసిఆర్‌కు రైతులు తగిన బుద్ధి చెబుతారన్నారు. పంజాబ్ మండిలో రైతుల వద్ద నుంచి వ్యాపారులు కోట్ల రూపాయలు లూటీ చేస్తూ మోసం చేస్తున్నారన్నారు. బికెఎస్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు పర్యాద అంజిరెడ్డి..మాట్లాడుతూ.. కూరగాయలు అమ్మే వాళ్లకు ఉన్న ఆదాయం పండించిన రైతుకు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు ఐక్యమై పోరాడి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. జాతీయ కార్యదర్శి కొండెల సాయి రెడ్డి మాట్లాడుతూ..తమ సంఘానికి ఏ పార్టీతోనూ సంబంధం లేదనీ, రైతుల సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తుందని తెలిపారు. బికెఎస్ రాష్ట్ర అధ్యక్షులు జి.రంగారావు అధ్యక్షత వహించారు. నేతలు డి.రాము, నానా ఆక్రే, ఎం.శ్రీధర్ రెడ్డి, జె కుమారస్వామి, ఎం రాజిరెడ్డి, పి వెంకట రెడ్డి, గైని నాగేశ్వర్, లావణ్య, యల్ మాణిక్ రెడ్డి, అంబిర్ ఆనందరావు బోరంపేట మల్లారెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రధాని ప్రకటన పచ్చి అబద్ధం


- సింగరేణిలోని నాలుగు బ్లాకులు ప్రయివేటుకు : సిఐటియు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సింగరేణి ప్రయివేటీకరణకు, కేంద్ర ప్రభుత్వానికి సంబంధం లేదని, అసలు ప్రయివేటీకరణ ఆలోచనే తమకు లేదని ప్రధాని నరేంద్రమోడీ పచ్చి అబద్ధాలు వల్లించారని సిఐటియు జాతీయ ఉపాధ్యక్షులు ఎం సాయిబాబు, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కరాములు, పాలడుగు భాస్కర్ విమర్శించారు. మోడీ వ్యాఖ్యలను ఖండిస్తున్నామని తెలిపారు. ఈ మేరకు వారు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తప్పుడు ప్రకటనల ద్వారా కార్మికవర్గాన్ని, ప్రజలను తప్పుదారి పట్టించే విధంగా మోడీ వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సింగరేణి బొగ్గు బ్లాకులను ఎవరికి కేటాయించాలనే అధికారం కేంద్ర ప్రభుత్వం చేతుల్లోనే ఉందని తెలిపారు. మోడీ ప్రభుత్వం ఈ విషయాన్ని దాచిపెట్టి అసత్యాలు చెబుతూ తెలంగాణ ప్రజలను తప్పుదారి పట్టిస్తుందని విమర్శించారు. మరోపక్క బొగ్గు శాఖ కేంద్ర మంత్రి బొగ్గుగనులను వేలం వేస్తున్నట్టుగా ప్రకటించడం వాస్తవాలను తెలియజేస్తుందని తెలిపారు. దాదాపు 450 మిలియన్ టన్నుల బొగ్గునిల్వలున్న కళ్యాణి గని బ్లాక్ -6, సత్తుపల్లి బ్లాక్ -3, శ్రావనపల్లి, కోయగూడెం బ్లాక్ -3 బ్లాకులను సింగరేణి సంస్థ రూ 59 కోట్లు ఖర్చు చేసి సర్వే నిర్వహించిందని గుర్తుచేశారు. ఆ బ్లాకులను తమకు కేటాయించాలని సింగరేణి సంస్థ అనేకసార్లు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేసిన విషయాన్ని ప్రస్తావించారు. అయినా ఆ సంస్థకు ఇవ్వలేదని తెలిపారు. ఆ నాలుగు బ్లాకులను వేలం పాట ద్వారా ప్రయివేటు కంపెనీలకు కేంద్రం అప్పజెప్పుతున్నదని విమర్శించారు.

వైద్యులకు సహాయ సహకారాలు అందిస్తాం

- ఐఎంఎ రాష్ట్ర సదస్సులో మంత్రి హరీశ్‌రావు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వైద్యులు వృత్తి ధర్మాన్ని పాటించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వైద్యులకు అన్ని సహాయ సహకారాలు అందిస్తామని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని వి కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) తెలంగాణ రాష్ట్ర 6వ సదుస్సు నిర్వహించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ప్రముఖ వైద్యులు ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షులుగా డాక్టర్ బిఎన్ రావు కార్యవర్గం ప్రమాణాస్వీకారం చేసింది. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు బిసి సంక్షేమ పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్, ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బోయినిపల్లి వినోద్‌కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, ఐఎంఎ జాతీయ అధ్యక్షులు సహజనంద ప్రసాద్‌సింగ్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో 17ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేసిందన్నారు. రానున్న రెండేళ్లలో 33 జిల్లాల్లో జిల్లాకో మెడికల్ కళాశాల ఏర్పాటు చేసి ప్రజలకు ఆరోగ్యకరమైన సేవలు అందిస్తామన్నారు. హైదరాబాద్‌లో బస్తీ దవాఖానలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. బస్తీ దవాఖానలతో ఉస్మానియా, గాంధీలో ఒపి రోగుల సంఖ్య గణనీయంగా తగ్గిందన్నారు. త్వరలో కరీంనగర్‌లో బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు.

రాష్ట్రంలో సూపర్ స్పెషాలటీ వైద్యసేవలను అందుబాటులోకి తీసుకొచ్చి కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా వైద్య సేవలు అందిస్తామన్నారు. ఎన్ఎంసి నిబంధనల పేరుతో ఇటీవల మంచిర్యాల మెడికల్ కళాశాలను రద్దు చేశారని తెలిపారు. కానీ ఎలాంటి కనీస సౌకర్యాలు లేని ఎఎంసికి పీజీ అడ్మీషన్లకు అనుమతినివ్వడం విడ్డూరంగా ఉందన్నారు. గ్రామ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి పల్లెదవాఖానలు తీసుకొస్తున్నట్టు తెలిపారు.

ఈ సదస్సుకు రాష్ట్ర నలమూలల నుంచి వైద్యులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. వైద్య రంగంలో వచ్చిన మార్పులకు అనుగుణంగా సేవలు అందించడం, రోగులతో వైద్యులు ఎలా ప్రవర్తించాలి, వైద్యులపై జరుగుతున్న దాడులను ఎదుర్కోవడం వంటి అంశాలతోపాటు సూపర్ స్పెషాలటీ వైద్య సేవలపై ఆయా విభాగాల నిపుణులు చర్చించారు. భవిష్యత్ కార్యాచరణ రూపొందించారు.

ఈ కార్యక్రమంలో నగర మేయర్ వై సునీల్‌రావు, ఐఎంఎ ప్రతినిధులు డాక్టర్ శరత్‌కుమర్ అగర్వాల్, కోశాధికారి డాక్టర్ ప్రవీణకుమార్ మన్న, డాక్టర్లు ఎం సంపత్‌రావు, డి లవకుమార్, బి నరేందర్‌రెడ్డి, గట్టు శ్రీనివాస్‌లు, పి రాంకిరణ్, బి జాన్సీ, వెంకట్‌రెడ్డి, అలీం, వెంకటేశ్వర్లు, రజనీప్రియదర్శిని, ఝాన్సీ, వసంత్‌రావు, అరుణ్ కరారి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

కొత్త ఏడాదిలో హెచ్‌పిఎస్ శతాబ్ది ఉత్సవాలు

ప్రజాశక్తి-హైదరాబాద్



హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ (హెచ్‌పిఎస్) బేగంపేట్ సొసైటీ, దాని బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ జనవరి 2023 నుండి ప్రారంభమయ్యే హెచ్‌పిఎస్ (బి) శతాబ్ది ఉత్సవాల కోసం ముందస్తు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. దీని తర్వాత హెచ్‌పిఎస్ విజన్ అండ్ మిషన్ 2050, భవిష్యత్తు మౌలిక సదుపాయాల ప్రణాళికలపై ఆదివారం వివరణాత్మకమైన ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో 300 మంది ప్రముఖ పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. తమ మద్దతును అందిస్తామని వారు ప్రతిజ్ఞ చేశారు, సమయం, ప్రతిభ, వనరులతో తాము చదివిన పూర్వ పాఠశాల ఉత్సవాలలో పాల్గొంటామని, సహాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ విందుకు హాజరైన ప్రముఖ పూర్వ విద్యార్థులలో మాజీ కేంద్ర మంత్రి, అశోక్ గజపతి రాజు, మాజీ పార్లమెంటు సభ్యులు, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, పద్మశ్రీ డా పి రఘురామ్, ఇన్వ్ అసెంట్ హరి బుగ్గనలతో పాటు ప్రముఖ వైద్యులు, వ్యాపారవేత్తలు, న్యాయవాదులు, రాజకీయ నాయకులు, క్రీడాకారులు, కళాకారులు, ఇతర సభ్యులు పాల్గొన్నారు. జనవరి 2023లో ప్రారంభమయ్యే శతాబ్ది ఉత్సవాలు, విద్యార్థులు, సిబ్బంది, తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థుల కోసం బహుళ కార్యకలాపాలు, ఈవెంట్లతో ఏడాది పొడవునా గ్రాండ్ సెలబ్రేషన్‌గా ప్లాన్ చేబడతాయని నిర్వాహకులు తెలిపారు.